క్లుప్తంగా

భక్తి భావ సమన్వితం తరంగ గానం



విజయవాడ కల్చరల్: లబ్బీపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సంగీత విద్వాంసులు నారాయణ తీర్థులు 348 వ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన తరంగ గానం భక్తి భావ రాగ సమన్వితంగా సాగింది. సంగీత ప్రయోక్త మల్లాది సూరిబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు ప్రారంభ కార్యక్రమంలో తరంగ గోష్ఠి గానం నిర్వహించారు. మల్లాది సూరిబాబు, మల్లాది బ్రదర్స్, పోపూరి గౌరీనాథ్, మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, విష్ణుభొట్ల సోదరీ మణులు పాల్గొన్నారు. సంగీతాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సామగాన లహరి ట్రస్ట్ చైర్మన్ మల్లాది సూరిబాబు నారాయణ తీర్థులు సంగీత సాహిత్య విశేషాలను వివరించారు. సంగీత కార్యక్రమాలు ఉదయం ప్రారంభమై 12 గంటలపాటు సాగాయి

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీ షిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి అమ్మ వారి మందిరంలో గురువారం సాయిబాబా, నాగమానసాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళా భక్తులు మందిర వ్యవస్థాపకుడు సుధాస్వామి అధ్వర్యంలో బాబాకు పుష్పాభిషేకం నిర్వహించారు. కనకమేడల భరత్ భూషణ్, శివపార్వతీ, పిల్లి కాశీ విశ్వనాథ్, రాజేశ్వరి, వెన్నా రామాంజనేయులు, రమాదేవి దంపతులు బాబాకు ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సుదాస్వామి మాట్లాడుతూ గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా జూలై 3వ తేదీన మందిరంలో ప్రత్యేక పూజలు, కాగడ ధూప్, హారతి, శేజ్ హారతి వంటి ప్రత్యేక హారతులు నిర్వహిస్తామన్నారు. బాబా పల్లకి ఊరేగింపుతో పాటు వేలాది మందికి అన్నప్రసాద వితరణ జరుగుతుందని, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వాహన చోదకులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పక ధరించాలని డాక్టర బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బి.వసంతకుమార్ సూచించారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో గురువారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబందనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు, షఫీవుల్లా, రఫీ, హేమంత్‌రావు, వి.విశ్వేశ్వరయ్య, రాజా రావు, రంగ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన లాప్‌టాప్ అందజేత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆటోలో మర్చిపోయిన లాప్‌టాప్‌ను గంట వ్యవధిలో ఫిర్యాదుదారునికి వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి అందించారు. నలందడిగ్రీ కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చదువుతున్న మానేపల్లి భాగ్యతేజ్ తన ఇంటి నుంచి గురువారం కళాశాలకు బయలుదేరాడు. ఆ క్రమంలో ఆటోలో కాళేశ్వరరావు మార్కెట్ వద్ద వేరే ఆటో ఎక్కాడు. ఆ క్రమంలో ఆటోలో తన బ్యాగ్‌ను మరిచిపోయాడు. దాంతో వెంటనే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చి సుమారు రూ.80 వేల విలువైన లాప్‌టాప్‌ను మర్చిపోయినట్లు ఫిర్యాదు చేశాడు. దానిపై పోలీసులు వారు ప్రత్యేకంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిశీలించారు. దాంతో ఆ ఆటోను గుర్తించి లాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను గుర్తించారు. అనంతరం దానిని భాగ్యతేజ్‌కు అందించారు. దాంతో ఆ కుటుంబం పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

మైనార్టీల హృదయాల్లో చెరగని ముద్ర

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సింగ్‌నగర్ ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు



ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రుహుల్లా



జింఖానా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మైనార్టీల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని గాంధీనగర్ జింఖానా మైదానంలో ముస్లింలతో కలిసి గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ మైనార్టీలకు ఇంతటి గుర్తింపు లేదన్నారు. ముస్లింల అభ్యున్నతికి ఆనాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి , ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ అన్ని విధాలా అండగా నిలిచారని తెలిపారు. వైఎస్సార్ అమలు చేసిన 4 శాతం రిజర్వేషన్లతో ఈ రోజున రాష్ట్రంలో ముస్లింలందరూ విద్య, వైద్య రంగాల్లో రాణించి డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని చెప్పారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మైనార్టీ యువతకు పెద్దఎత్తున అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక నిధులు కేటాయించి ఉర్దూ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని గుర్తుచేశారు. గత తెలుగు దేశం ప్రభుత్వం ముస్లింలను పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. గతంతో పోలిస్తే మైనార్టీలకు ఈ ప్రభుత్వంలో ఎక్కువ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 60,54,839 మైనార్టీలకు వివిధ పథకాల ద్వారా రూ. 20 వేల కోట్లకు పైగా లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. అలాగే ముస్లిం మైనార్టీల కోసం సబ్ ప్లాన్ రూపొందించిన ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇచ్చే గౌరవ భృతిని గత ప్రభుత్వం పక్కనపెడితే ఈ ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించడమేకాక పెంచిన గౌరవ భృతిని అందిస్తోందన్నారు. ఉర్దూ భాషకు గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ వల్ల ఏపీ నుంచి తొలిసారిగా హజ్ యాత్ర ప్రారంభమైందన్నారు. అటువంటి ప్రభుత్వానికి మైనార్టీలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఈ లోకంలో మనకు దైవం తరువాతే ఏదైనా అనే సత్యాన్ని చాటి చెప్పేందుకు... ప్రతి ఒక్కరిలో స్వార్థాన్ని రూపుమాపి దానం, సేవా గుణాన్ని పెంపొందించేందుకు బక్రీద్ పండుగ ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో గురువారం జరిగిన పలు ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. భగవంతుడైన ఆ అల్లాహ్‌కు తొలి ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. ఈ లోకంలో ధనము, ఆస్తి, అంతస్తులు, కుటుంబ సభ్యులను ఎంతగా ప్రేమించినా అవన్నీ దేవుని తరువాతే అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని బక్రీద్ పండుగ చాటి చెబుతుందన్నారు. ప్రతి ఒక్కరిలో సేవా, దాన గుణాలను మరింత పెంచేందుకు ప్రతీకగా బక్రీద్ పండుగను సాంప్రదాయంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. ఆ అల్లాహ్ దీవెనలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ముస్లిం మైనార్టీలంతా జగనన్నకు ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు. మైనార్టీ పెద్దలు ఎండీ హఫీజుల్లా, ఆయా మస్జీదులు, ఈద్గా కమిటీల పెద్దలు పాల్గొన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ షాదీఖానా ఈద్గాలో గురువారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. త్యాగనిరతికి, భక్తిభావానికి బక్రీద్ ప్రతీక అన్నారు. ఈ పర్వదినాన ధనం, ఇష్టపడే ఆహార పదార్థాలు, వస్తువులను దానం చేయడం అనాదిగా వస్తుందన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధిపై సీఎం జగనన్న ప్రత్యేక దృష్టిసారించారని చెప్పారు. ముస్లిం మైనార్టీలంతా సొంత పార్టీగా చెప్పుకునేది వైఎస్సార్ సీపీనే అని స్పష్టం చేశారు. సింగ్‌నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో ఈద్గాను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈద్గా కమిటీ పెద్దలు షేక్ నాగూర్, రహీం, రసూల్, షేక్ వలి, రషీద్, జలీల్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ అఫ్రోజ్, పఠాన్ నజీర్‌ఖాన్, షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు చివరి నాటికి కృష్ణా జలాలు అందిస్తాం



డివిజన్‌లో అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాలకు ఆగస్టు చివరి నాటికి కృష్ణా జలాలు అందిస్తామని ఏపీ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 30వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ బి. హెచ్‌ఎస్‌పీ జానారెడ్డి అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. దావుబుచ్చయ్యకాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు కాలనీ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి కొంతమేర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు. తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరలా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకుంటోందని తెలిపారు. దాదాపు రూ. 23 కోట్ల అభివృద్ధి పనులు ఈ ప్రభుత్వంలో చేపట్టినట్లు పేర్కొన్నారు. కేవలం రోడ్ల నిర్మాణానికే రూ. 9 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈఈ(ఇంజనీరింగ్) శ్రీనివాస్, ఈఈ(ఎలక్ట్రికల్) బి.వి.సుధాకర్, డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, డీఈ(ఎలక్ట్రికల్) నాగసాయి, అధికారులు, కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జిల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జేసీఎస్ ఇన్‌చార్జిలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 1,23,24,25, 26,27,36 డివిజన్లకు జేసీఎస్ ఇన్‌చార్జిగా బోగాధి మురళి, 28,29,30, 31,32,33 డివిజన్లకు కంభం కొండలరావు, 58, 59,60 ,61, 62,63,64 డివిజన్లకు మహమ్మద్ రఫీ నియమితులయ్యారు.

3న గురుపౌర్ణమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని శ్రీ కళ్యాన సాయిబాబా మందిరంలో వచ్చేనెల 3వ తేదీ సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షులు మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ ఉదయం 5.30 గంటలకు కాకడ హారతితో గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు బాబావారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల 3వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని షిర్డీసాయిబాబా మందిరంలో వేంచేసి ఉన్న త్రిమూర్తి స్వరూప సద్గురు సాయినాధునికి 121 కేజీల పంచదారతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని జరపనున్నామని ఆ ఆలయ కమిటీ అధ్యక్షురాలు గరికపాటి బాలత్రిపురసుందరీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకడ హారతి, మధ్యాహ్న హారతి, సంధ్యా హారతిలతో పాటు నక్షత్రమాలిక, సాయినామ సంకీర్తన, శేజారతి, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలానే దక్షిణముఖ అభయ ఆంజనేయ స్వామి, నాగేంద్రస్వామి వార్ల 13వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 5వ తేదీన ప్రత్యేక అభిషేకాలు చేస్తామన్నారు.

గణాంకశాస్త్రంతో దేశాభివృద్ధి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కిరణ్‌కుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గణాంకశాస్త్రం ద్వారా దేశాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు చేయవచ్చని నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఫీల్డ్ ఆపరేషన్ డివిజన్) ఆర్ కిరణ్‌కుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా గణాంక శాస్త్ర ప్రాముఖ్యతపై సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆర్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాజ వికాసానికి, అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయటానికి గణాంకాలు చాలా అవససరమన్నారు. ఆయా గణాంకాలను సేకరించటానికి వాటిని అధ్యయనం చేయటానికి, ఫలితాలను వివరించేందుకు గణాంక శాస్త్రం చాలా ఉపకరిస్తుందన్నారు. గణాంకశాస్త్రంపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. గణాంకశాస్త్ర నిపుణులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు గణాంకశాస్త్రంలో నైపుణ్యాలను సాధించాలన్నారు. ఈ రంగానికి సంబంధించిన నిపుణుల కొరత ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. ఈ శాస్త్రంలో పట్టు సాధించటం ద్వారా అద్భుతమైన అవకాశాలను పొందవచ్చని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో వివిధ అంశాలపై నిర్వహించిన పలు పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. స్టాటిస్టిక్స్ విభాగాధిపతి సీహెచ్ రాధిక, అధ్యాపకులు డాక్టర్ పి.శేషుబాబు, సిహెచ్ సౌజన్య, సురేఖ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి



ఉమా బలరాంను సత్కరిస్తున్న సత్యనారాయణ, పరచూరి విజయలక్ష్మి

విజయవాడ కల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని శాతవాహనా కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన భక్తి సంగీత, ఆపాత మధుర గీతాలు, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ కవులు, రచయితలు కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న సావిత్రి కళాపీఠం సేవలను అభినందించారు. సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, బ్రాహ్మణ సంఘం నాయకులు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులకు నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువరు గాయనీ గాయకులు భక్తి గీతాలను ఆలపించారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై అంతర్గత బదిలీలు జరిగాయి. ఏఈవో స్థాయి నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు సుమారు వంద మందిని ఏక కాలంలో బదిలీ చేస్తూ ఈవో భ్రమరాంబ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ అంతర్గత బదిలీలు జరిగినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అధికారులను అంతర్గత బదిలీ చేస్తూ జారీ చేసిన సర్క్యులర్‌లోనే ఆయా అధికారులు ఏ తేదీన బదిలీ అవుతారో తెలియజేయడం గమనార్హం. మరో వైపున ఈ బదిలీలు ప్రతి మూడు నెలలకు ఒక సారి తప్పని సరిగా జరుగుతాయని అంటున్నారు.

హక్కులపై మహిళలకు అవగాహన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 'నిర్భయ్ భారత్- సశక్తి నారీ' అనే అంశంపై విజయవాడ రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైల్వే హాస్పటల్ సీఎమ్ఎస్ డాక్టర్ ఎం.శౌరిబాల పాల్గొని మహిళ ఆరోగ్యం, పోషకాహారం, విద్య, బాలల హక్కులు, మహిళా హక్కులు, సాధికారిత అనే అంశాలపై మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబతో పాటు సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. దైనందిన జీవితంలో మహిళలు రోజు తీసుకునే ఆహారంతో పాటు అదనంగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మహిళ ఆరోగ్యం, మహిళా హక్కులు, సాధికారతపై అవగాహన కల్పించేందుకు ఇప్పటికే హాస్పటల్ సిబ్బంది అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఏసీఎమ్ఎస్ డాక్టర్ ఎమ్.జైదీప్, డాక్టర్ సీతారాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొలిఏకాదశి పర్వదిన వేడుకలు



విజయేశ్వర లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న మల్లాది విష్ణు



అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో స్వామివారు



మధురానగర్ శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో బాబా

మధురానగర్(విజయవాడసెంట్రల్): తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం మధురానగర్, ముత్యాలంపాడు, అయోధ్యనగర్, రామకష్ణాపురం, మాచవరంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 5 గంటల నుంచే దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. తొలి పండుగ సందర్భంగా అందరికీ మంచి జరగాలంటూ ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. విశేష సంఖ్యలో భక్తులు దేవాలయాలకు చేరుకుని అభిషేకాలు చేయించుకున్నారు. అనంతరం స్వామివార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విజయదుర్గానగర్‌లోని విజయదుర్గాదేవి సమేత విజయేశ్వర లక్ష్మీ వెంకటేశ్వరస్వామివారి దేవాలయంలో గురువారం తొలిఏకాదశి పూజల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్పొరేటర్ బీహెచ్ఎస్‌పీ జానారెడ్డితో కలిసి పూజలు చే శారు. అయోధ్యనగర్‌లోని దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవీ, పద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం తులసీ దళ అర్చన శాస్త్రోక్తంగా చేశారు. తదుపరి ఉదయం 10గంటలకు భక్త మండలి ఆధ్వర్యంలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. కార్యక్రమాలను శ్రీధర్మపరిషత్ పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పసుపుతోటలోని శ్రీదత్త సాయి మందిరలో ప్రత్యేక పూజలు, అబిషేకాలు నిర్వహించారు. మద్యాహ్నం యాక్స్ టైలర్స్ అధినేత వాలేశ్వరరావు సహకారంతో 600 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ వ్యవస్థాపకులు తంగెళ్ల మూడి వీరమోహనరావు పర్యవేక్షించారు. మధురానగర్ మెయిన్‌రోడ్డులోని షిర్డీసాయిబాబా మందిరంలో తొలిఏకాధశి పూజలు ఘనంగా జరిగాయి. బాబావారికి పంచామృతాభిషేకం చేశారు. ముత్యాలంపాడులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో విశేషంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో బాబాకు విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు పేలపిండి ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

భక్తులతో కిటకిట లాడిన దేవాలయాలు

విజయవాడ కల్చరల్: తొలి ఏకాదశి సందర్భంగా నగరంలోని పలు దేవాయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 9గంటల నుంచే భక్తులు దైవ దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్నారు. లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. దేవాలయ ట్రస్టీబోర్డ్ చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం, మేనేజర్ శర్మ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పున్నమ్మతోటలోని టీటీడీ దేవస్థానంలో దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చక స్వాములు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్ర సముదాయంలోని వెంకటేశ్వర స్వామికి షోడష ఉపచారాలు నిర్వహించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఆలయాల్లో తొలిఏకాదశి పూజలు

పాయకాపురం(విజయవాడరూరల్): తొలిఏకాదశి సందర్భంగా 61వ డివిజన్ వాంబేకాలనీ హెచ్‌బ్లాక్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి కుటుంబసభ్యులతో పూజల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్, పార్టీ నాయకులు అవుటుపల్లి నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్లోని రామాలయంలో తొలిఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్లోని శ్రీకోదండ రామాలయంలో తొలిఏకాదశి సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. శివునికి అభిషేకాలు నిర్వహించారు. ఉడా కాలనీలోని సాయిబాబా మందిరంలో పూజలు చేశారు.

టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు ఎం.కృష్ణప్రభు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పట్టుదలతో నేర్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు ఎం.కృష్ణ ప్రభు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్, ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ 9వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కృష్ణ ప్రభు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కుటుంబాలు గడవాలంటే పురుషులతో పాటుగా మహిళలు కూడా ఆర్థిక సంపాదనలో భాగం పంచుకోక తప్పనిస్థితి ఏర్పడిందన్నారు. అనేక సమస్యలు ఉన్న వాటికి కుంగిపోకుండా అధికమించాలనే పట్టుదల ఉండాలన్నారు. కొత్త ఆలోచనలు చేసినప్పుడే అభివృద్ధి చెందగలమన్నారు. మహిళలు, ఆడపిల్లల అభివృద్ధికి రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ప్రెసిడెంట్ బి.రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ టైలరింగ్ నేర్చుకుంటున్న వారు ఇంతటితో ఆగిపోకుండా నిరంతరం నైపుణ్యాన్ని పెంచుకునే కృషి చేయాలన్నారు. మారుతున్న ఫ్యాషన్స్‌కు అనుగుణంగా స్కిల్స్ పెరగాలన్నారు. మంచి నైపుణ్యం కలిగిన టైలర్స్‌గా అభివృద్ధి కావాలన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా శిక్షణా విభాగం బాధ్యులు విజయ, కార్యక్రమాల కమిటీ కన్వీనర్ యు.వి.రామరాజు, టైలరింగ్ టీచర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

డెప్యూటీ డీఈఓ కుమార్



ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్న డెప్యూటీ డీఈఓ కుమార్

ఆటోనగర్(విజయవాడతూర్పు): సెలవు దినాల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డెప్యూటీ డీఈఓ కేవీఎస్ కుమార్ హెచ్చరించారు. గురువారం బక్రీద్ పండుగ రోజున పటమటలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో తరగతులు నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వస్తున్నారన్న సమాచారంతో విద్యార్థులను పంపించారు. ఉపాధ్యాయులను డెప్యూటీ డీఈఓ కుమార్ ప్రశ్నించారు. అకడమిక్ ఇయర్ ప్రారంభమై 20 రోజులు కాకముందే క్లాసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. మరలా ఇలాంటి సమస్య ఉత్పన్నమైయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సెలవుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలుకు పంపించడం నేరమన్నారు. సెలవుల్లో ప్రశాంతంగా ఇంటి వద్ద ఉండే విధంగా చూడాలన్నారు.